
# చూపుడువేలు

బి. రఘురామరాజు



నగరం పొలిమేరలు దాటగానే వేగం పుంజుకుంది బస్సు. కిటికీలోంచి వీస్తున్న చల్లగాలికి నిద్రలోకి జారుకున్నాడు నా పక్కశాల్తీ.

ఎంత లేదన్నా ఇంకో అరగంట ప్రయాణం చేయాలి నేను దిగాల్సిన స్టేజి రావడానికి. అంతవరకు కాలక్షేపం చేయడానికి దినపత్రిక అయితే బావుండుననుకుని నా పక్కశాల్తీవంక చూశాను. పత్రికలోని అన్ని పేజీలు తోటి ప్రయాణీకులకు దానం చేశాక మిగిలిన రెండు పేజీలను అక్షరం విడకుండా చదివి, ఒళ్లో పెట్టుకుని నిద్రపోతున్నాడతను.

'ప్రధానికి ప్రతిపక్షనాయకుడి అల్టిమేటమ్', 'పాక్ సరిహద్దుల్లో పెరిగిపోతున్న ఉద్రిక్తత' - అతని ఒళ్లో రెపరెపలాడుతున్న పేపర్లోంచి తెగ ఊరించేస్తున్నాయి వార్తలు. పేపరుకోసం అతన్ని నిద్ర లేపాలా, వద్దా అని నేను సంశయిస్తుంటే, నా పక్క త్రీసీటర్‌లోంచి ఓ నిర్మొహమాటస్థుడు లేచొచ్చి, నా పక్క శాల్తీ వీపు తట్టి, "పేపర్!" అన్నాడు దాదాపు ఆజ్ఞాపిస్తున్న ధోరణిలో. అతడి సంబోధనలో అభ్యర్థింపు కానీ, నమ్రత కానీ ఏ కోశానా లేవు. పైగా, 'ఇంత అమూల్యమైన పేపరును ఒడిలో ఉంచుకుని నిద్రపోవడానికి నీకు సిగ్గుగా లేదూ?' అన్నట్లున్నాయి అతని చూపులు.

ఉలిక్కిపడి నిద్ర లేచి, తన స్టేజి వచ్చిందేమోనని కంగారుగా సామాను అందుకోబోయాడు పక్కశాల్తీ. కానీ అతను దిగాల్సిన స్టేజి ఇంకా రాలేదని, కేవలం పేపరు కోసమే తనను నిద్ర లేపారన్న విషయం బోధపడి పేపరు తీసి విసురుగా అతని చేతికందించాడు. పేపరు తీసుకున్న వ్యక్తి అలా కదిలీ కదలగానే -

"రాను రానూ మనుషులకు ఇంగితం లేకుండా పోతోంది. పేపరడగటానికికూడా పక్కవాణ్ణి నిద్రలేపడం సభ్యత అనిపించుకుంటుందా!" అని గొణుగుతూ నా వంక చూశాడు - తన వ్యాఖ్యను బలపరచమన్నట్లుగా. 'అతను అంటున్నది సబబే!' అన్నట్లు నేను తలాడించడంతో రెచ్చిపోయి, విద్యావంతులైన ప్రయాణీకుల సంస్కారహీనతను దుయ్యబట్టసాగాడతను.

"కేవలం మన తెలుగు వాళ్లకే ఉన్న జాడ్యం, మహమ్మారి ఇది! ప్రాణం తీసినా సరే, దినపత్రిక కొనుక్కునే 'పాడుపని'కి పూనుకోరు. బస్టాండులో దొంతర పేర్చిన దినపత్రికలవంక కన్నెత్తయినా చూడరు గాక చూడరు! కానీ బస్సులోకి అడుగు పెట్టగానే పేపరు కోసం వాళ్లు గాలించని మూలంటూ ఉండదు. ఒక్కడి చేతిలో పేపరు కనిపించినా చాలు, అందరూ తోడేళ్లలాగా ఎగబడి, అసలువాడికి ఒక్క పేజీ కూడా మిగల్చకుండా లాక్కుని మరీ చదువుతారు!

"అదే కేరళలోనో, తమిళనాడులోనో అయితే - రిక్షా తొక్కేవాడు, రోడ్డుపక్కన చిలుకజోస్యం చెప్పుకుని బతికేవాడు కూడా దినపత్రిక కొనుక్కోవడంతోనే తన దినచర్య ప్రారంభిస్తారు!

"పోనీ, ఇలా పేపరు కొనుక్కోని వాళ్లంతా డబ్బు లేనివాళ్లనుకుందామంటే, బొత్తిగా వీల్లేదు! వాళ్లలో చాలామంది ఉద్యోగస్తులే! కనీసం నెలకు నాలుగైదు వేలయినా సంపాదిస్తున్నవాళ్లే! అదటుంచండి, పేపరు ధర కూడా ఎంత చెప్పండి ... ముష్టి మూడు రూపాయలు! ఒక్క టీ తాగినంత కదా!

"పోనీ, కొనుక్కోపోతే కొనుక్కోపోయారులెండి! కనీసం కొనుక్కున్నవాళ్లు పేపరు పూర్తిగా చదివేవరకైనా వేచి ఉండాలి కదా! అదీ లేదు. వాడి చేతిలోంచే, వాడి నడక్కుండా ... అదేదో పిత్రార్జితమైనట్టు చటుక్కున లాక్కుంటారు. అదీ ఫరవాలేదనుకుందాం!

"కొనుక్కున్నవాళ్లు నిద్రపోతుంటే, నిద్ర లేచేదాకా అయినా ఓపిక పట్టాలి కదా పేపరు కోసం! ఊహుఁ, భుజం తట్టి, వళ్లు కుదిపి అక్కడికీ స్పందించకపోతే ముఖాన గ్లాసెడు నీళ్లయినా గుమ్మరించి నిద్ర లేపి అడుగుతారు పేపరు. ఏం సంస్కారం చెప్పండి మనది?"

అతనలా తీవ్రస్వరంతో విద్యావంతులైన ప్రయాణికులందరినీ కట్టగట్టి ఏకడం మొదలుపెట్టేసరికి ఒక్కొక్కరూ లేచొచ్చి తాము తీసుకెళ్లిన దినపత్రిక పేజీలను మౌనంగా అతనికి అప్పగించసాగారు.

అతని ప్రపంచ జ్ఞానానికి, వాక్చాతుర్యానికి చకితుడినై నా పక్క శాస్త్రీవంక చూస్తున్న సమయానికి - చివికిపోయిన ధోవతీ, బొత్తాలూడిన లాల్చీ ధరించిన ఓ అరవయ్యేళ్ల పెద్దమనిషి ముందు సీట్లోంచి లేచి వెనుకవైపు రాసాగాడు, సుతారంగా కళ్లజోడు సవరించుకుంటూ. అతనలా నెమ్మదిగా వస్తూ ప్రయాణీకులందరినీ ఒక్కొక్కరినీ గుచ్చిగుచ్చి పరిశీలనగా చూడ్డం విడ్డూరంగా తోచింది నాకు.

చివరికా మనిషి నా సీటు దగ్గర ఆగిపోయి "చదవడం పూర్తయితే నా పేపరు నాకు కాస్త తిరిగిస్తారా, మాస్టారూ! వచ్చే స్టేజిలో దిగాలి నేను!" అన్నాడు బోసి నవ్వుతో.

అతను సంబోధిస్తున్నది ఎవరిని చెప్మా? అని పరికించి చూద్దును కదా! పేజీలు క్రమంగా సర్దిన దినపత్రికను, తలవంచుకుని అతని చేతికందిస్తున్నాడు నా పక్కశాస్త్రీ! ■

## తపాలా బిళ్లల కథలు

# పర్వత శిల్పాలు



ఈ తపాలాబిళ్ల పేరు మౌంట్ రష్మోడ్. 1952లో దీన్ని వెలువరించడానికి వెనక ఓ కథ ఉంది.

సౌత్ డకోటాలోని బ్లాక్ హిల్స్‌లోని మౌంట్ రష్ పర్వతాన్ని తొలిచి గుట్జన్ బోర్గలమ్ నలుగురు అమెరికన్ ప్రెసిడెంట్స్ ముఖాలను చెక్కాడు. ఓ కొండని అలాగే ఉంచి శిల్పాలను చెక్కడం చరిత్రలో ఇదే మొదటిసారి. (రెండో ప్రయత్నంకూడా ప్రస్తుతం అమెరికాలోనే జరుగుతోంది.)

1916లో జాన్ గుట్జన్ డి లామోథి బోర్గలమ్ అనే 45 ఏళ్ల శిల్పి(తన పేరుని గుట్జన్ బోర్గలమ్‌గా కుదించుకున్నాడు)కి ఈ ఆలోచన వచ్చింది. అయితే మొదటి ప్రపంచ యుద్ధంవల్ల ఇది ఆలస్యం అయి, 1927లో పని మొదలుపెట్టాడు. పారిస్, లండన్, శాన్‌ఫ్రాన్సిస్కోలలో శిక్షణపొందిన బోర్గలమ్ నలుగురు అమెరికన్ ప్రెసిడెంట్స్ - జార్జ్ వాషింగ్‌టన్, థామస్ జెఫర్సన్, అబ్రహాం లింకన్, థియోడర్ రూజ్‌వెల్ట్‌ల మొహాలను మౌంట్ రష్మోడ్ పర్వతంలో చెక్కాడు. సముద్రమట్టానికి ఆరు వేల అడుగుల ఎత్తున ఉన్న ఈ పర్వతం ఎత్తు 5,000 అడుగులు. పూర్తయిన ఒక్కొక్క మొహం ఎత్తు 60 అడుగుల పొడవు ఉంటుంది. మనిషి మొహానికి 465 రెట్లు అధిక పరిమాణంలో చెక్కారివి. ఈ మొహాలు 60 మైళ్ల దూరంనుంచే కనిపిస్తాయి. ఆ పర్వతంలోని రెండు చదరపు మైళ్ల విస్తీర్ణంలో ఈ నాలుగు మొహాలూ చెక్కారు.

జార్జి వాషింగ్‌టన్ మొహం జూలై 4, 1930న; మిగిలిన మూడు మరో 11 సంవత్సరాల్లో పూర్తయ్యాయి. 1941లో అవి పూర్తయ్యాక 70 ఏళ్ల వయసులో మరణించాడు. అయితే ఆఖరి ముఖాకృతి అయిన రూజ్‌వెల్ట్ మొహానికి తుదిమెరుగులను బోర్గలమ్ కొడుకు లింకన్ దిద్దాడు.

ఈరోజుకి మౌంట్ రష్మోడ్‌లోని ఈ ముఖాకృతులను కనీసం 20 కోట్లమంది సందర్శించి ఉంటారు. అమెరికన్ నేషనల్ మానుమెంట్ అయిన దీన్ని ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ 'నార్త్ బై నార్త్ వెస్ట్' అనే చిత్రంలో క్లైమాక్స్ దృశ్యాలు చిత్రీకరించడానికి ఉపయోగించుకున్నాడు. అమెరికన్ నేషనల్ పార్క్ అథారిటీ ఆధ్వర్యంలో ఉన్న ఈ మానుమెంట్ దగ్గర ప్రతిరాత్రి 'లైట్ అండ్ షో' ప్రదర్శిస్తున్నారు. (గోల్కొండ ఫోర్ట్‌లోకూడా ఈ తరహా ప్రదర్శనను ఏర్పాటు చేయడానికి మౌంట్ రష్మోడ్‌లోని ప్రదర్శనే ఆదర్శం.)

1952లో అమెరికన్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ మౌంట్ రష్మోడ్ గౌరవార్థం ఈ తపాలాబిళ్లను విడుదలచేసింది.

-డి. పద్మజ ■